ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 22 జులై, 2026 | పేజీలు : 08

## సిఎంని కలిసిన కనర్ గాం ఉప సర్పంచ్



7 లో...

# ‘ఎల్‌నినో’ నేపథ్యంలో వరి సాగు వద్దు

### ప్రత్యామ్నాయ పంటలే మేలు
### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఎల్‌నినో నేపథ్యంలో వరి సాగు వద్దు, ప్రత్యామ్నాయ పంటలే మేలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి పాల్గొన్నారు.అనంతరం గ్రామంలోని రైతు వేదికలో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ,జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రస్తుత తీవ్ర ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ..... తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి అర్హ పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేస్తోందన్నారు. ఆర్థిక పరిస్థితులు సవాలుగా ఉన్నప్పటికీ పేదల ఆత్మగౌరవాన్ని కాపాడటంలో ప్రభుత్వం ఎక్కడా వెనుకడుగు వేయదన్నారు.రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 35 శాతం వర్షపాతం లోటు నమోదైందని, భూగర్భ జలాలు కూడా వేగంగా తగ్గిపోతున్నాయని తెలిపారు. వాతావరణ శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కూడా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు సంప్రదాయ వరి సాగుపై ఆధారపడకుండా వ్యవసాయ శాఖ సూచించిన కందులు,పెసర్లు,మినుములు,ఇతర పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు, ఉద్యాన పంటలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు.తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకుంటే నష్టాలను తగ్గించుకోవచ్చని అన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు,అధికారులు అందిస్తున్న సూచనలను ప్రతి రైతు పాటించాలని, అవసరమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు, ప్రభుత్వ సహాయ సహకారాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ప్రస్తుతం బోర్లలో నీరు కనిపిస్తున్నప్పటికీ పంట చివరి దశ వరకు అది నిలిచే పరిస్థితి లేదని, రోజురోజుకు భూగర్భ జలాలు తగ్గుతున్నందున వరి సాగు రైతులకు ప్రమాదంగా మారే అవకాశముందని పేర్కొన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో వరి సాగును పూర్తిగా నివారించాలని విజ్ఞప్తి చేశారు.ఆయిల్‌పామ్ పంట తక్కువ నీటితో సాగుతుందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రం కరోనా తరహా క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ సూచనలు పాటించాలని పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో జిల్లాలో తాగు నీటి సరఫరాను నిరంతరంగా కొనసాగించడమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని తెలిపారు. ఈ సీజన్‌లో కాలువల ద్వారా సాగునీరు అందించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన విత్తనాలను జిల్లాలో సమృద్ధిగా సిద్ధంగా ఉంచామని, రైతులు తక్కువ నీటి అవసరం ఉన్న పంటలనే ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రతి దశలో రైతులకు అండగా ఉంటుందని తెలిపారు.గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలాలు గణనీయంగా తగ్గాయని, ప్రస్తుతం బోర్లలో నీరు ఉన్నా పంట పెరిగే సమయంలో నీటి కొరత ఏర్పడి దిగుబడులు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కలెక్టర్ సూచించారు.అనంతరం ఇటీవల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పనులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన

తరువాయి 2 లో...

## వేగవంతంగా ‘సర్’ డిజిటలైజేషన్

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
### 74.01 శాతం డిజిటలైజేషన్ పూర్తి
### కలెక్టర్ చిత్రా మిశ్రా




**ప్రజాపక్షం/కరీంనగర్:** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో అందుబాటులో ఉన్న సమయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించి ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, ఎన్యూమరేషన్ ప్రక్రియ తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

తరువాయి 2 లో...

## జాతీయ రహదారులపై
# ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

### స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్
### అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష
### హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యమని స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్ స్పష్టం చేశారు. జాతీయ రహదారులపై రోడ్డు భద్రత చర్యలపై స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, పోలీస్ శాఖ, జాతీయ రహదారి శాఖ అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారుల వెంట భారీ వాహనాలు, ట్రక్కులు పార్కింగ్ చేయవద్దని సూచించారు. నిర్దేశిత ప్రాంతాలు మినహా ఎక్కడా వాహనాలు పార్కింగ్ చేయవద్దని స్పష్టం చేశారు. అలాగే రోడ్డుపై ఆక్రమణలు ఉండకుండా చూడాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు అధికారులు, పోలీసులు, జాతీయ రహదారుల అధికారులతో టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే జాతీయ రహదారుల వెంట పోలీస్,

తరువాయి 2 లో...

# పోలీసింగ్‌లో ప్రజల భాగస్వామ్యమే విజయానికి మూలం

పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

ఇల్లందకుంటలో సీసీ కెమెరాల ప్రారంభం

వనమహోత్సవంలో మొక్కలు నాటిన సీపీ

ప్రజాపక్షం/కరీంనగర్: పోలీస్–ప్రజల సమన్వయం తోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, పోలీసింగ్ లో ప్రజల భాగస్వామ్యమే విజయానికి మూలమని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. మంగళవారం ఇల్లందకుంట మండలంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజా భద్రత, పర్యావరణ పరిరక్షణ, విద్యార్థుల అవగాహన, రోడ్డు భద్రత, పోలీసింగ్ బలోపేతానికి సంబంధించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొదట ఇల్లందకుంట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా నిఘా వ్యవస్థను ప్రారంభించిన సీపీ, గ్రామాల్లో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, దర్యాప్తులో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ప్రజల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు.గ్రామాల్లో మాదకద్రవ్యాలు, జూదం, సైబర్ మోసాలు, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఇతర అక్రమ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.అనంతరం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. నేటి మొక్కలే రేపటి తరాలకు జీవనాధారమని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా అత్యవసర పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లు ముద్రించిన ఎగ్జామ్ ప్యాడ్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యతో పాటు భద్రతపై కూడా అవగాహన కలిగి ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా స్థానిక ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేసిన సీపీ, హెల్మెట్ ధరించడం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాకుండా ప్రాణ రక్షణకు అత్యంత అవసరమని పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా జమ్మికుంట రూరల్ సర్కిల్ కార్యాలయం, ఇల్లందకుంట పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ నిర్వహించారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో వేగం




పెంచడంతో పాటు నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ప్రతిపాదిత ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించి, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందేలా త్వరితగతిన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో హుజూరాబాద్ ఏసీపీ మాధవి, హుజూరాబాద్ రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జమ్మికుంట రూరల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్, ఇల్లందుకుంట ఎస్సై ఎం. క్రాంతికుమార్ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## రూ.19 లక్షలతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని 21వ డివిజన్ వికలాంగుల కాలనీలో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.19 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్‌కోలగాని శ్రీనివాస్ గారు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, వికలాంగుల కాలనీలో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు, అవసరమైన అన్ని మౌలిక వసతులను దశలవారీగా కల్పించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వరాల నర్సింగం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మున్సిపల్ అధికారులు, వికలాంగుల సంఘ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వేడుకగా బోనాల పండుగ

ప్రజాపక్షం/కరీంనగర్: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో బోనాల ఉత్సవాలను మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకలను అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బోనాల పండుగను చాలా సంతోషంతో తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. విద్యా సంస్థల్లో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా బోనాల ఉత్సవాలను చాలా గొప్పగా నిర్వహించుకోవడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరూ సంస్కృతి సాంప్రదాయాలను పాటించాలని మరియు అమ్మవారిని వివిధ రూపంలో కొలవాలని అన్నారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపచేసాయి. ప్రధానంగా విద్యార్థులు నరేందర్ రెడ్డి గారికి మూధం అందజేసి ప్రత్యేక నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# అమెజాన్‌లో ఆన్‌లైన్ మోసం..?

బాధితుడి షాక్

ప్రజాపక్షం /కరీంనగర్ టౌన్ : ఆన్‌లైన్ షాపింగ్‌లో మరోసారి వినియోగదారులు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రముఖ ఈ–కామర్స్ సంస్థ అమెజాన్‌లో ఐఫోన్ 17 ప్రో ను ఆర్డర్ చేసిన కరీంనగర్ భగత్ నగర్ కు చెందిన వినియోగదారుడికి అసలు మొబైల్‌కు బదులుగా డమ్మీ డిస్ప్లే ఫోన్ డెలివరీ అయిన ఘటన కలకలం రేపుతోంది. బాధితుడు లక్షా యాభై వేల రూపాయల విలువైన ఐఫోన్ 17 ప్రో ను అమెజాన్ లో ఆర్డర్ చేయగా, ఓపెన్ బాక్స్ డెలివరీ చేయాల్సి ఉండగా, ప్రముఖ డాక్టర్ అయిన వినియోగదారుడు ఆసుపత్రి లో తీరిక లేని సమయంలో డెలివరీ బాయ్ ఫోన్ చేసి ఓటీపీ తీసుకుని పార్సెల్ ఓపెన్ చేయకుండానే ఇంట్లో కుటుంబ సభ్యులకు ఇచ్చి వెళ్లాడు. డ్యూటీ తర్వాత వచ్చి పార్సెల్ తెరిచి చూడగా పనిచేయని డమ్మీ డిస్ప్లే ఫోన్ మాత్రమే కనిపించినట్లు తెలిపారు. దీంతో వెంటనే అమెజాన్ కస్టమర్ సపోర్ట్‌ను సంప్రదించి రిటర్న్ కోసం అభ్యర్థించారు. అయితే, రిటర్న్ పికప్ కోసం వచ్చిన డెలివరీ ప్రతినిధి (పికప్ బాయ్) పార్సెల్‌లో అసలు ఫోన్ లేదని, కంపెనీ నిబంధనల ప్రకారం దీనిని రిటర్న్‌గా స్వీకరించలేమని చెప్పినట్లు బాధితుడు ఆరోపించారు . దీంతో అమెజాన్ పై చర్యలు తీసుకోవాలని వినియోగదారుల ఫోరంను సంప్రదించి,ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# పయాణికుల ఇక్కట్లను తీర్చిన సర్పంచ్ సుదాటి

ప్రజాపక్షం/ముత్తారం : ముత్తారం మండల కేంద్రంలో ప్రధాన రహదారి అధ్వానంగా తయారై ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై స్థానిక సర్పంచ్ సుదాటి రవీందర్ రావు తక్షణమే స్పందించారు.మండల కేంద్రంలోని కాసర్ల గడ్డ నుండి ముత్తారం మూలమలుపు వరకు ఉన్న ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా మారి, వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది.దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ సమస్యను గమనించిన సర్పంచ్ రవీందర్ రావు చొరవతో జేసీబీ సహాయంతో రోడ్డు పక్కన తాత్కాలిక కాలువలు తవ్వించి, నిలిచిన నీటిని తొలగించారు.సర్పంచ్ సకాలంలో స్పందించి నీటిని తొలగించడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పాయి. అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుండి మంథని వరకు, అలాగే ప్రభుత్వ ఆసుపత్రి చివర నుండి రోడ్డు పనులను పూర్తి చేసిన కాంట్రాక్టర్.. కాసర్ల గడ్డ నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు మాత్రం పనులను మధ్యలోనే వదిలేశారు.దీంతో ముత్తారం తహసీల్దార్ కార్యాలయానికి, ఎంపీడీవో కార్యాలయానికి వచ్చే ప్రజలు,వాహనదారులు నిత్యం నరకయా



తన అనుభవిస్తున్నారు.ఇంత జరుగుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోడ్డుపై నీరు నిలిచి, బురద గుంటలుగా మారాయని..దీనివల్ల దోమలు, కీటకాలు చేరి వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించి,నిలిచిపోయిన రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# దోమల నివారణకు చర్యలు

ప్రజాపక్షం/ముత్తారం : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముత్తారం మండల కేంద్రంలో సర్పంచ్ రవీందర్ రావు ఆధ్వర్యంలో ముమ్మరంగా దోమల నివారణ చర్యలు చేపట్టారు.ప్రధాన రహదారి పక్కన పడేసిన పాత ట్రాక్టర్ టైర్లు తోపాటు ఇతర వాహనాల టైర్లలో చేరిన నిల్వ నీటిని సర్పంచ్ సూదాటి రవీందర్ రావు స్వయంగా పరిశీలించారు.ఆసుపత్రి సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి ఆయన టైర్లలోని నీటిని తొలగించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలందరూ బాధ్యతగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని పిలుపునిచ్చారు.దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఇళ్ల పరిసరాల్లోని టైర్లు, నీటి ట్యాంకులు,పూల కుండీలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ,వాటిని ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# 'ఎల్‌నినో' నేపథ్యంలో వరి సాగు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

కట్ల అశోక్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరఫున రూ.8 లక్షల ఆర్థిక సహాయ చెక్కును మంత్రి అందజేసి పరామర్శించారు.తదుపరి గ్రామంలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు.చిన్నారులకు నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.అనంతరం ధర్మారం ఎంపీడీవో కార్యాలయంలో 34 మంది లబ్ధిదారులకు రూ.34 లక్షల విలువైన కళ్యాణలక్ష్మి చెక్కులు, 73 మంది లబ్ధిదారులకు రూ.24,08,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,వ్యవసాయ శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు,వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), రైతులు,గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారులపై ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

రవాణా శాఖ అధికారుల పెట్రోలింగ్ వాహనాలు ఎప్పుడూ పెట్రోలింగ్ చేసేలా చూడాలని సూచించారు. ఆ వాహనంలో అత్యవసర సేవలు అందించే సామాగ్రి అందుబాటులో ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తమ జిల్లా పరిధిలో అన్ని ఆసుపత్రుల వివరాలు, ట్రామా కేర్ సెంటర్ల వివరాలు మ్యాపింగ్ చేసి అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాలని సూచించారు.

ప్రభుత్వ ఆదేశాలు పక్కాగా అమలు

రోడ్డు భద్రత కింద జారీ చేసిన ఆదేశాలను జిల్లాలో పక్కాగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ జాతీయ రహదారుల వెంట గుర్తించిన బ్లాక్ స్పాట్స్ సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన పనులపై ఆరా తీసి భవిష్యత్తు ప్రణాళికలపై దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, ఆర్అండ్ బీ డీఈలు శాంతయ్య, వరప్రసాద్, పోలీస్, నేషనల్ హై వే అధికారులు పాల్గొన్నారు.

## వేగవంతంగా 'సర్' డిజిటలైజేషన్

(మొదటి పేజీ తరువాయి)

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) రోజుకు కనీసం 100 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేసే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. జులై 15వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 లక్షల ఓటర్ల వివరాలు డిజిటలైజ్ కాగా, గత ఏడు రోజుల్లో కేవలం 22 లక్షల వివరాలు మాత్రమే డిజిటలైజ్ అయ్యాయని, ఈ పురోగతి ఆశించిన స్థాయిలో లేదన్నారు. వచ్చే సమీక్షా సమావేశం నాటికి రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలనే లక్ష్యంతో అన్ని జిల్లాలు పనిచేయాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా కరీంనగర్ జిల్లా డిజిటలైజేషన్ పురోగతిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో మొత్తం 74.01 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా కరీంనగర్ – 59.18 శాతం, చొప్పదండి – 84.11 శాతం, మానకొండూర్ – 86 .19 శాతం, హుజూరాబాద్ – 75.18 శాతం డిజిటలైజేషన్ పూర్తయినట్లు వెల్లడించారు. వచ్చే ఆదివారం నాటికి జిల్లాలో 90 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నామని, అలాగే ఏఎస్‌డీ జాబితాను త్వరితగతిన సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో జల కుమారి, తహసీల్దార్లు లక్ష్మీ నరసింగరావు, రాజేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడిగా లక్ష్మణ్

ప్రజాపక్షం/గన్నేరువరం: గన్నేరువరం మండల నాయి బ్రాహ్మణ సేవాసంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో గన్నేరువరం నాయి బ్రాహ్మణ సేవా మండల అధ్యక్షునిగా గర్షకుర్తి లక్ష్మణ్ , ప్రధాన కార్యదర్శిగా మిడిదొడ్డి అనిల్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య నియామకపత్రం అందజేశారు. అనంతరం గర్షకుర్తి లక్ష్మణ్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయి బ్రాహ్మణ సేవా సంఘం బలోపేతానికి, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. జిల్లా ప్రచార కార్యదర్శి మిడిదొడ్డి రవీందర్, మండల మాజీ గౌరవ అధ్యక్షులు నాగవెల్లి లక్ష్మి రాజం ,గర్షకుర్తి బాలయ్య , సమ్మెట అనిల్ మండలంలోని బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడిగా చెరిపెల్లి పరుశరాములు గౌడ్



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల :** గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా చెరిపల్లి పరశురాములు గౌడ్ ను నియమించి మోకు దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు అమరవేణి నరస గౌడ్ నియామక పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గౌడ కులస్తుల, గీత కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడుతున్న గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ సంఘం తమ నూతన కార్యవర్గాన్ని విస్తరిస్తుందని రాష్ట్ర కార్యవర్గం తెలిపింది. ఈ పదవి మూడేళ్ల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు.నూతనంగా ఎన్నికైన పరశురాములు గౌడ్ రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. గీత కార్మికుల, గౌడ కులస్థుల సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని గౌడ సామాజిక వర్గాన్ని ఏకం చేసి హక్కుల సాధన దిశగా ముందుకు తీసుకెళ్తామన్నారు.

## నాయి బ్రాహ్మణ సంఘం బోనాల మహోత్సవంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజా పక్షం/ వేములవాడ:** వేములవాడ పట్టణంలో నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించిన బోనాల మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆషాడ మాస ఉత్సవాల్లో భాగంగా నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు, మహిళలు భక్తిశ్రద్ధలతో పోచమ్మ అమ్మవారికి సమర్పించిన బోనాల ఊరేగింపులో ఆయన పాలుపంచుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ అని పేర్కొన్నారు. వేములవాడ రాజన్న క్షేత్రంతో పాటు నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.కుల వృత్తులకు, స్థానిక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని, నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అస్తవ్యస్తం.. అధ్వానం.. బురదమయంగా మారిన ప్రధాన రహదారి

### సిసి రోడ్డుపై మట్టి పోయడంతో
### నరకప్రాయంగా మారిన గ్రామస్తుల ప్రయాణం!



**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామంలో రహదారి దుస్థితి గ్రామస్తులకు నరకప్రాయంగా మారింది.గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు,ఇటీవల సి సి రోడ్డుపై పోసిన మట్టి కారణంగా ప్రధాన రహదారి పూర్తిగా బురదమయంగా మారింది.పారుపల్లి గ్రామంలో సుమారు 20 సంవత్సరాల క్రితం వేసిన సీసీ రోడ్డు ప్రస్తుతం పూర్తిగా పాడైపోయి గుంతలమయంగా మారింది .అయితే, ఈ గుంతలను పూడ్చేందుకు గ్రామ సర్పంచ్ చొప్పరి సంపత్ రోడ్డుపై మట్టిని పోయించారు.కాగా,గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఆ మట్టి అంతా కరిగి,నీరు నిలిచి రోడ్డు మొత్తం బురద గుంటగా తయారైంది.నరకప్రాయంగావిద్యార్థుల,వృద్ధుల ప్రయా ణం ఈ బురద రోడ్డు కారణంగా పాఠశాలలకు వెళ్లే చిన్న పిల్లలు,విద్యార్థులు, వృద్ధులు,గ్రామస్తులు నడవలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కాళ్లు జారి బురదలో పడిపోతున్నామని, కనీసం నడిచే పరిస్థితి కూడా లేదని స్థానికులు వాపోతున్నారు. చెడిపోయిన సీసీ రోడ్డుపై మట్టి పోయకుండా ఉంటేనే బాగుండేదని, మట్టి పోసి తమకు లేనిపోని తిప్పలు తెచ్చారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారిపై ఉన్న బురద మట్టిని వెంటనే తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. తాత్కాలిక పనులు కాకుండా,పారుపల్లి గ్రామానికి తక్షణమే కొత్త సీసీ రోడ్డును మంజూరు చేసి నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

## చినుకుపడితే చిత్తడే..గలీజుగా మారిన గిద్దచెరువు



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** వర్షకాలంలో చినుకుపడితే చాలు గిద్దచెరువు కట్ట బురదతో గలీజుగా మారింది.అధికార యంత్రాంగం పట్టింప్పకోక అస్తవ్యస్తంగా మారింది.సీసీ రోడ్డు వేస్తే బాగుంటుందని ఎల్లారెడ్డిపేట వాస్తవ్యులు కోరుతున్నారు.పాలకవర్గం ఏ మాత్రం పట్టించుకోక పోవడంతో వాకింగ్‌కు వెళ్ళే వ్యక్తులు బురదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రజాప్రతినిధులు సుందరీకరణ చేస్తామని ప్రకటనలకే పరిమితమయ్యారు.అంతే కాకుండా పల్లెప్రకృతి వనంలో ఓపెన్‌జిమ్ పరికరాలు వ్యాయామానికి సైతం పనికి రాకుండా విరిగిపోయాయి.దీంతో గతంలో ఉన్న సెక్రటరీలకు,మండల ఉన్నతాధికారులకు చెప్పినప్పటికి ఫలితం లేకుండా పోయింది.మండలంలో పారిశుద్యం లోపిస్తే రోగాలబారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.పలు వాడలలో వర్షం పడితే చాలు రోడ్లు గుంతమయంగా మారుతున్నాయి,అభివృద్ధి పనులకు లక్షలు వెచ్చించి పనులు చేపట్టమని ప్రభుత్వాలు కోరినప్పటికి అభివృద్ధిపనులు ఎక్కడికక్కడే కుంటు పడుతున్నాయి.వర్షాకాలంలో ఫ్రైడే, డ్రైడే తప్పకుండా పాటించాలని ఎల్లారెడ్డిపేట గ్రామస్తులు కోరుతున్నారు.దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతిరోజు పాగింగ్ ఉపయోగించాలని చెబుతున్నారు.

## ప్రజల సంక్షేమం పట్టణ అభివృద్ధే ధ్యేయంగా పాలన

### సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ కళచక్రపాణి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజల సంక్షేమం పట్టణ అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తామని సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి అన్నారు. మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 19 వ వార్డులో సి.సి రోడ్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.19వ వార్డులో చాలా సంవత్సరాల క్రితం నిర్మించిన సిసి రోడ్డు శిథిలావస్థకు చేరుకోగా గత మున్సిపల్ పాలకవర్గం సమయంలో సమస్యను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా రాజ్యసభ సభ్యులు డి. దామోదర్ రావుతో మాట్లాడి రాజ్యసభ ప్రత్యేక నిధుల ద్వారా రోడ్డు నిర్మాణానికి 6 లక్షల రూపాయలు విడుదల చేయించారని, కొన్ని కారణాల వల్ల ఈ రోడ్డు పనులు చేపట్టలేకపోయామని అదనంగా రోడ్డును నిర్మించవలసి రావడంతో రోడ్డు నిర్మాణ పనుల కు 6 లక్షల రూపాయల చాలక పోవడంతో మున్సిపల్ యొక్క జనరల్ నిధుల నుండి మరో 3 లక్షల రూపాయలను కేటాయించి రోడ్డును నిర్మించడం కోసం నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాబోయే రోజుల్లో అన్ని వార్డులలో రోడ్లు, మురికి కాలువలు వంటి అభివృద్ధి పనులను ప్రజలకు మౌలిక వసతులు కల్పించేలా భవిష్యత్ ప్రణాళికను చేపడతామని ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండి ఖాదిర్ పాషా, కౌన్సిలర్ బొద్దుల శ్రీనివాస్, డిఈ వాణి, ఏఈ నరసింహస్వామి పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారానికి బాధ్యతగా పనిచేయాలి

### జిల్లా ఎస్పి మహేష్ బి. గితే

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రతి అధికారి బాధ్యతగా పనిచేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే పోలీసు అధికారులకు సూచించారు. ప్రజల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ, పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను నిరంతరం పర్యవేక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే మంగళవారం తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, పెట్రోలింగ్ నిర్వహణ, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి పోలీసు సేవలను మరింత వేగవంతంగా,పారదర్శకంగా అందించాలని తెలిపారు.స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పి వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సి ఐ నాగేశ్వర రావు, ఎస్.ఐ లు ఉపేందర్ చారి, మల్లేష్ , సిబ్బంది ఉన్నారు.



## యువకుడిని పరామర్శించిన సర్పంచ్



**ప్రజాపక్షం/ముత్తారం :** అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడిని స్థానిక సర్పంచ్ పరామర్శించి ధైర్యం చెప్పారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం జిల్లెల్లపల్లి గ్రామానికి చెందిన వేముల వెంకటేష్ అనే యువకుడు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ప్రస్తుతం అతడు గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు.ఈ విషయం తెలుసుకున్న జిల్లెల్లపల్లి గ్రామ సర్పంచ్ గద్దం రాజేశం మంగళవారం ఆసుపత్రికి వెళ్లి వెంకటేష్‌ను పరామర్శించారు.అతని ఆరోగ్య పరిస్థితిని అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని ఈ సందర్భంగా వైద్యులను కోరారు.అనంతరం వెంకటేష్,ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ.. ఎవరూ అధైర్య పడవద్దని,తమ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని సర్పంచ్ భరోసా ఇచ్చారు.

## అనారోగ్యంతో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామంలో విషాదం నెలకొంది.గ్రామానికి చెందిన ఉడత సదానందం (45) అనే వ్యక్తి మంగళవారం అనారోగ్యంతో అకాల మరణం చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సదానందా నికి మంగళవారం ఉదయం ఒక్కసారిగా ఫిట్స్ (మూర్ఛ) వచ్చింది. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో ఆయనను గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తుండగానే సదానందం పరిస్థితి విషమించి, ఆసుపత్రిలోనే కన్నుమూశారు. మృతునికి భార్య మమత,కుమారుడు గణేష్,తల్లి పోసాని ఉన్నారు.సదానందం అకాల మరణంతో ఓడేడు గ్రామం లో విషాద ఛాయలు అలుముకున్నాయి.సదానందం మృతి విషయం తెలుసుకున్న పలువురు రాజకీయ నాయకులు ఆయన నివాసానికి చేరుకుని భౌతికకాయాన్ని సందర్శించారు.మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ గాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి,ఉప సర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్,షేర్ స్వామి,బొమ్మిడి మల్లేష్, బిక్కినేని సుధాకర్ రావు, దాసరి దామోదర్ గౌడ్, నరెడ్ల రమేష్ ఉన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి చంద్రమౌళి గౌడ్, తీగల సత్యనారాయణరావు, కోటగిరి శ్రీనివాస్ తో పాటు తదితరులు కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## 'ఎల్‌నినో'పై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం /ముస్తాబాద్ :** ముస్తాబాద్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్నినో ప్రభావం వలన నీటి వనరులలో తగ్గుదలను ప్రస్తుత పరిస్థితులని గమనించి రైతులకి తక్కువగా నీటిని ఉపయోగించి పంటల సాగు, నీటి యాజమాన్యం ప్రణాళిక గురించి మంగళవారం గూడెం, చీకోడ్, మొరాయిపల్లి, బదనకల్, కొండాపూర్, తుర్కపల్లి, రామలక్ష్మణపల్లి గ్రామ పంచాయతీలయందు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎల్నినో ప్రభావం వలన వర్షాలు లేకపోవడం వలన తక్కువ నీటి తో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలు కంది, పెసర, జొన్న, ఆముదం, పొద్దుతిరుగుడు సాగు చేయాలని రైతులకి సూచించారు. రాబోయే రోజుల్లో బోర్లు చెరువుల ద్వారా నీటి లభ్యత మరింత తగ్గే అవకాశం ఉన్నందున నీటి నీ ఆదా చేసే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసిపెట్టుబడి వ్యయం తగ్గించుకొని నష్టాలను తగ్గించు చుకోవాలి అని రైతులకి వ్యవసాయ అధికారి అనూష వ్యవసాయ విస్తరణ అధికారులు అనూష, నరేష్, రేవతి, అఖిల సూచించారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్‌లు , ఉపసర్పంచ్ లు , పంచాయతి కార్యదర్శి ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

## ఘనంగా ఖర్గే జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారంఅఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,రాజ్య సభ ప్రతి పక్ష నాయడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఖర్గే చేస్తున్న సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య , మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ ,పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్,ఉన్నారు.

## రైతులలో నెలకొన్న వివాదాలు తొలగిపోతాయి



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న భూభారతి లో భాగంగా భూ రీ సర్వే తో రైతులను నెలకొన్న వివాదాలు తొలగిపోయి పరిష్కారం అవుతాయని తాసిల్దార్ రామచందర్ గుండంపల్లి గ్రామ సర్పంచ్ డప్పుల పద్మ నరసయ్య అన్నారు. మంగళవారం గుండంపల్లి మల్లాపూర్ గ్రామాల మధ్య ఉన్న రాందాస్ పేట పరిధిలో ఉన్న రైతులకు భూ రీ సర్వే పై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. రైతులు ఎలాంటి అపోహాలు చెందొద్దని, అధికారులు చేపట్టే సర్వే సహకరించాలని రైతులను కోరారు. రెవిన్యూ ఇన్స్పెక్టర్ అశోక్, సర్వేర్ కుమారస్వామి, ఉప సర్పంచ్ జగ్గుల గంగాధర్ నాయకులు అంతడుపులు నరసయ్య రాందాస్ పేట పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

## పాము కాటుతో బాలుడి మృతి



**ప్రజాపక్షం/ధర్మపురి :** పాము కాటుతో బాలుడు మృతి చెందిన సంఘటన జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో చోటుచేసుకుంది. ధర్మపురి ఎస్సై గురుక మహేష్ కథనం ప్రకారం పట్టణంలోని శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి కాలనీకి చెందిన ముస్కు రాజవ్వ కు కుమారుడు లోకేష్ (4) ఉండగా అతడు పట్టణంలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో యూకేజీ చదువుతున్నాడు.రోజూ లాగే మంగళవారం ఉదయం 6 గంటలకు నిద్రలేచిన లోకేష్ తన ఇంటి సమీపంలో మూత్ర విసర్జన చేస్తున్న సమయంలో విష సర్పం కాటువేసింది. వెంటనే బాలుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందిస్తుండగా మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల :** ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.బుగ్గారం మండలం ఎంపీడీవో కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు పాల్గొని అర్హులైన 44 మంది లబ్ధిదారులకు రూ. 15.98 లక్షల విలువ గల చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి పేద , మధ్యతరగతి కుటుంబాలకు అత్యవసర సమయంలో అండగా నిలిచే గొప్ప సంక్షేమ పథకమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందలేని కుటుంబాలకు ప్రభుత్వం సకాలంలో సహాయం అందిస్తూ వారి జీవితాల్లో భరోసా నింపుతోందని తెలిపారు.ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రజా సేవే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు,నాయకులు పాల్గొన్నారు.

# మెరుగైన మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

### సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/ఎండపెల్లి :** విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతుల కల్పనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లె లోని తెలంగాణ మోడల్ స్కూల్ , జూనియర్ కళాశాలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా గత కొన్ని రోజులుగా విద్యార్థులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి, వర్షం కురుస్తున్నప్పటికీ విద్యార్థుల సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి తక్షణమే బోర్‌వెల్ తవ్వకాలకు భూమిపూజ నిర్వహించి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.అనంతరం రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన కిచెన్ షెడ్‌ను ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా విద్యార్థులు తమ పాఠశాలలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని మంత్రిని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.తదుపరి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పాఠశాల ప్రిన్సిపాల్‌కు మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు ఉన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ మెట్‌పల్లి పట్టణ శాఖ ఆధ్వర్యంలో మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి రణభేరి ధర్నా నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు ధోనికెల నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నా కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా. అనూప్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఒకప్పుడు ఉద్యమించాల్సి వచ్చిందని, ఇప్పుడు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల కోసం విద్యార్థులతో కలిసి ఉద్యమించాల్సిన పరిస్థితి రావడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఫీజు రీయింబర్స్మెంట్ పథకంపై ఆధారపడి లక్షలాది మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని,ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేసి పథకాన్ని నిరంతరాయంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు మధ్యలోనే చదువును నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు.ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి యువతను మోసం చేశారని విమర్శించిన నాయకులు, మరోవైపు గురుకుల సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యతలేని ఆహారం అందుతోందన్నారు. కుళ్లిపోయిన కూరగాయలు, పురుగులు పట్టిన అన్నం కారణంగా విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొంటూ, ఇలాంటి పరిస్థితులపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.బీజేపీ నాయకులు,కార్యకర్తలు,విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** రత్నాపూర్ గ్రామ అభివృద్ధిలో గల్ఫ్ అసోసియేషన్ సేవాసమితి సభ్యులు పాలుపంచుకుంటున్నారని గ్రామ సర్పంచ్ గొండ రాజేందర్ అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మరణించిన వారి అంత్యక్రియలకు తరలించే స్వర్గ రతాన్ని 340000 రూపాయలతో కొనుగోలు చేసి గ్రామానికి అందించడం అభినందనీయమని అన్నారు. గత ఏడాది సైతం భవాని మాత మండప నిర్మాణం 3 లక్షల 50 వేల రూపాయలతో షెడ్ను నిర్మించి గ్రామ అభివృద్ధిలో పాలు పంచుకున్నారని వారి సేవలు అభినందనీయమని కొనియాడారు.



# ఓటరు నమోదు సవరణ 'సర్' పరిశీలన

### కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్



**ప్రజాపక్షం/వీర్నపల్లి :** మండల కేంద్రంలోని పలు గ్రామాలలో ఒటరు నమోదు సవరణ సర్ కార్యక్రమంను రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గర్జనపల్లి గ్రామంలో ఆయన మట్లాడుతూ బీఎల్ఓ, బీఎల్‌ఏ లు అప్రమత్తంగా ఉండి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించాలని, అలాగే సర్ పత్రాలను ప్రతి ఇంటికి అందజేసి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఒక ఓటు కీలకమని, అర్హులైన ప్రతి ఓటరు నమోదు చేసే బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలని కోరారు. ఈ ప్రక్రియను తొందరగా అన్లైన్ చేసి జిల్లాలో వీర్నపల్లి మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు భూక్య సంతోష్ నాయక్ తో పాటు గ్రామ సర్పంచ్ రాకేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఓ, బీఎల్‌ఏ లు పాల్గోన్నారు.

## మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్ తనిఖీ చేసిన ఎంపిడిఒ



**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలోని మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్‌ను ఎంపీడీవో సి.హెచ్. గణేష్, ఎంపీఓ రామకృష్ణ రాజు తో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా విధానం, నిర్వహణ తీరును సమీక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం డబ్బా గ్రామంలో నిర్మిస్తున్న ఇంకుడు గుంతల పనులను పరిశీలించి, పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.అలాగే గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేసి వాటి నిర్వహణ తీరును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈలు మల్లేష్,వింధ్యా రాణి,పంచాయతీ కార్యదర్శి రవళి తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్న ఆలయంలో వైభవంగా వరుణ యాగం

**ప్రజా పక్షం/మల్యాల :** ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ, దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం లో మంగళవారం ఉదయం వరుణ యాగం, వరుణ జపం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయస్వామి వారికి విశేష అభిషేకం నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు అనుకూలంగా సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని వేద మంత్రోచ్చారణల మధ్య ఈ క్రతువుని శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి (ఈఓ) ఎస్. అంజనారెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి (ఏఈఓ) హరిహారనాథ్, సూపరింటెండెంట్లు సునీల్, చంద్రశేఖర్‌తో పాటు ఆలయ స్థానాచారి కపిందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, ఉప ప్రధాన అర్చక చిరంజీవి ,మారుతి ప్రసాద్, చిన్న రాము వేద పండితులు రాజేశ్వర శర్మ,పెద్దన్న శర్మ,తేజ శర్మ పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల విరాళం



**ప్రజా పక్షం/భైంసా :** భైంసా పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిరం కిసాన్ గల్లి పాఠశాల భైంసాలో చదివిన 2003–2004 బ్యాచ్ విద్యార్థులు పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకొని, పాఠశాల ఆధునీకరణ (స్థల రిజిస్ట్రేషన్ కోసం) 76,450 రూపాయలు విరాళంగా ఇవ్వడం జరిగింది. వారికి పాఠశాల తరుపున కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పురస్త గోపాల్ కిషన్, రమేష్, మాశెట్టి వార్ నగేశ్, కాశీనాథ్, బజనోల్ల రవి, ప్రబంధ కారిణి, సలహా సమితి సభ్యులు, ఆచార్యులు పాల్గొన్నారు.

## రాజురలో రామాలయ నిర్మాణం

### మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి



**ప్రజాపక్షం /లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని రాజుర గ్రామంలో రూ. 50 లక్షల అంచనా వ్యయంతో (రూ. 40 లక్షలు సిజిఎఫ్, రూ. 10 లక్షలు గ్రామస్తుల డిపాజిట్ రామాలయ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. మంజూరైన టెండర్ అప్రూవల్ కాపీని మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి గ్రామస్తులకు అందజేశారు. త్వరలోనే అగ్రిమెంట్ పూర్తి చేసి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.ఆలయ నిర్మాణానికి టెండర్ అప్రూవల్ ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావులకు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్యామల, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముత్త గౌడ్, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## సిబ్బంది అందుబాటులో ఉండాలి: డిఎంహెచ్ఒ

**ప్రజాపక్షం / జన్నారం/ నస్పూర్ :** వర్షాకాలం దృష్ట్యా వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ఆదేశించారు. జన్నారం పిహెచ్‌సిని సందర్శించిన ఆయన, వైద్య సిబ్బందితో ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. వర్షాల వల్ల మలేరియా, డెంగ్యూ, అతిసారం వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరిగి మందులు అందజేయాలని, వారంలో రెండు రోజులు డ్రై డే పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. పిహెచ్‌సీలు, పాఠశాలలు, హాస్టళ్లలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ స్నేహిత, సిబ్బంది పాల్గొన్నారు.

# ఢిల్లీలో విద్యార్థులపై దాడి దారుణం




**ప్రజాపక్షం / బెల్లంపల్లి టౌన్ :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చలో పార్లమెంట్ నిర్వహించిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, బాష్పవాయు గోళాలు ప్రయోగించడాన్ని ఎం సిపిఐయు మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలోని ఎం సిపిఐ యు పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత కోసం గత 20 రోజులుగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులతో చర్చలు జరపకుండా బలప్రయోగం చేయడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. విద్యార్థులపై దాడికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని, వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్, ఆరెపల్లి సతీష్, వంశీ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష

**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతికి కారణమైన నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పి నితికా పంత్ తెలిపారు. 2022 జూన్ 14న బుదల్ ఘాట్ వంతెన సమీపంలో రాజేంద్రకుమార్ అనే వ్యక్తి అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ ఎన్. భీంరావు, ఎన్. రాజశేఖర్‌ను ఢీకొట్టడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేసి, దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో ఆసిఫాబాద్ అదనపు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ అనంత లక్ష్మి ఈ మేరకు తీర్పు వెలువరించినట్లు ఎస్పి పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని అభినందించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని విజ్ఞప్తి చేశారు.

# జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు

### రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్




**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ లోని సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పిలు, రవాణా, ఆర్అండ్‌బి శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి నెలా జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాలు నిర్వహించాలని, బ్లాక్ స్పాట్లను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ కె.హరిత మాట్లాడుతూ జిల్లాలోని 52 కిలోమీటర్ల జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటున్నామని, పెట్రోలింగ్ వాహనాలు, అంబులెన్సులు అందుబాటులో ఉంచామని వివరించారు. అనంతరం లారీ డ్రైవర్లకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పి నితికా పంత్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

# ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించే వరకు పోరాటాలు

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ రూరల్ :** బంబారా గ్రామ పంచాయతీ పరిధిలో జాతీయ రహదారిపై ఫుట్ బ్రిడ్జి నిర్మాణం చేపటే వరకు సిపిఐ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు నిర్వహిస్తామని సిపిఐ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి స్పష్టం చేశారు. నేషనల్ హైవే రావడం వల్ల విద్యార్థులు, స్థానిక ప్రజలు రహదారి దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి ఫుట్ బ్రిడ్జి, బస్ షెల్టర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా ఎస్ పి నితికా పంత్, ఆర్డీవో కార్యాలయ ఏవో దుర్గం శ్రావణ్ కుమార్‌లకు వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, సమస్యల పరిష్కారానికి రాబోయే రోజుల్లో దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోయిరె ప్రకాష్, మండల కార్యదర్శి కొదురుపాక మహేష్, ఎఐవైఎఫ్ మండల అధ్యక్షుడు పిప్పిరి వెంకటేష్, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వర్కులు రాకేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఇన్చార్జ్ ఇటాంకర్ తిరుపతి పాల్గొన్నారు.

# సీటి స్కాన్ నిలిచిపోవడంపై హెచ్ఆర్‌సి ఆగ్రహం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గత ఏడాది కాలంగా సీటి స్కాన్ యంత్రం పనిచేయకపోవడంపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందిస్తూ సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. ఆమ్ ఆద్మీ పార్టీ దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా స్పందించిన హెచ్.ఆర్.సి చైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్, ఈ సమస్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు.ఈ వివరాలను ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సయ్యద్ హైదర్ విలేకరులతో మాట్లాడుతూ వెల్లడించారు. జిల్లా ఆసుపత్రికి నిత్యం వచ్చే పేద రోగులకు సీటీ స్కాన్ సేవలు అందక ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లలో వేల రూపాయలు సమర్పించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక అధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతోనే తాము కమిషన్‌ను ఆశ్రయించామని చెప్పారు.ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్త యంత్రాన్ని ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ హెచ్చరించింది.

## 23న కలప వేలం

### ఎఫ్‌డిఒ రామ్మోహన్



**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం ప్రభుత్వ కలప డిపోలో ఈ నెల 23న అటవీ శాఖ ఆధ్వర్యంలో కలప లాట్ల బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు అటవీ డివిజనల్ అధికారి రామ్మోహన్ తెలిపారు. వేలంలో మొత్తం 204 కలప లాట్లు, 55.461 ఘన మీటర్ల కలప అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు సుమారు 150 లాట్లను ప్రారంభ వేలం ధరపై 20 శాతం తగ్గింపుతో విక్రయించనున్నట్లు వెల్లడించారు. పాత కలప లాట్లు కూడా విక్రయిస్తామని తెలిపారు. తక్కువ ధరకు నాణ్యమైన కలప కొనుగోలుకు మంచి అవకాశమని, వ్యాపారులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఇన్‌చార్జి మంత్రి జూపల్లికి సిపిఐ కృతజ్ఞతలు

**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి మండలంలోని బెండర ఆదర్శ మోడల్ డిగ్రీ కళాశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు సిపిఐ వాంకిడి మండల సమితి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. ఇటీవల కోమటిగూడ పర్యటనకు వచ్చిన మంత్రిని కలిసి సిపిఐ నాయకులు కళాశాల మౌలిక వసతులపై వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిగ్రీ కళాశాలల కమిషనర్‌కు సిఫారసు చేసినట్లు సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు వర్కొల్ రాకేష్ తెలిపారు. సిసి రోడ్డు, ప్రహరీ గోడ, తాగునీరు, మరుగుదొడ్లు, హాస్టల్ వసతితో పాటు అదనపు గదులు మంజూరు చేయాలని కోరినట్లు వెల్లడించారు. మంత్రి చొరవపై హర్షం వ్యక్తం చేస్తూ, సిఫారసులను అధికారులు త్వరితగతిన అమలు చేసి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## మొక్కల పరిరక్షణకు ప్రాధాన్యత

### జిఎం ఎం. శ్రీరమేష్



**ప్రజాపక్షం / రెబ్బన :** నాటిన మొక్కలను పరిరక్షించడానికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీరమేష్ అన్నారు. మంగళవారం రెబ్బెన మండలం గోలేటి సిహెచ్‌పి వద్ద అధికారులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సింగరేణి సంస్థ ఒక ఉద్యమంలా మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గనుల డంపులపై మొక్కలు నాటి అటవీ శాఖకు అందించడం ద్వారా కొత్త గనులకు అనుమతులు వస్తున్నాయని పేర్కొన్నారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ మొక్కలను భావితరాలకు ఫలాలను ఇచ్చే వృక్షాలుగా పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ కృష్ణమూర్తి, అధికారులు కె రాజమల్లు, ఎన్ ఉమాకాంత్, స్వామి రాజు, కోటయ్య, దేవరకొండ కిరణ్ బాబు, జైపాల్ జాదవ్, సుష్మ లక్ష్మి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాంకిడిలో వర్షాలు

**ప్రజాపక్షం / వాంకిడి :** వారం రోజులుగా వర్షాలు లేక ఆందోళన చెందుతున్న వాంకిడి మండల రైతులకు సోమవారం రాత్రి కురిసిన వర్షం తీపి కబురు అందించింది. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురవడంతో ఎండిపోతున్న పత్తి, కంది, సోయాబీన్, మిర్చి పంటలు పునరుజ్జీవం పోసుకున్నాయి. దీంతో రైతులు ఉత్సాహంగా పొలాల్లో కలుపు తీయడం, ఎరువులు వేయడం వంటి సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 38 వేల ఎకరాల్లో పత్తి, 3 వేల ఎకరాల్లో కంది, వెయ్యి ఎకరాల్లో పెసరతో పాటు ఇతర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షం పంటల ఎదుగుదలకు ఎంతో మేలు చేస్తుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. రాబోయే రెండు రోజుల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ ప్రకటనతో అన్నదాతలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

## ఎస్సైగా ప్రదీప్ బాధ్యతల స్వీకరణ




ప్రజాపక్షం/లోకేశ్వరం ః లోకేశ్వరం మండల పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా ప్రదీప్ మంగళ వారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచే సిన ఎస్ఐ అశోక్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో ప్రదీప్ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా నూతన ఎస్ఐ ప్రదీప్ మాట్లా డుతూ... మండలంలో శాంతిభద్రతల పరిరక్ష ణకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయాల్లో పోలీసుల సహకారం తీసుకోవాలని, చట్టవ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడితే సహించేది లేదని ఆయన పేర్కొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల టిజిసిజిటిఏ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ ః తెలంగాణ ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ అధ్యాపక సంఘం నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యూనిట్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. కళాశాల యూనిట్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ కె. సూర్య సాగర్, ప్రధాన కార్యదర్శిగా కుంట శ్రీహరిలు ఏకగ్రీవంగా ఎన్నుకోబ డ్డారు.ఈ ఎన్నిక ప్రక్రియకు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ యు. గంగాధర్ ఎన్నికల అధి కారిగా వ్యవహరించారు.నూతనంగా ఎన్నికైన అధ్యక్ష,కార్యదర్శులను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్, టిజిఒ(ఎస్) అధ్య క్షుడు డాక్టర్ పి. జి. రెడ్డి అభినందించి, శుభా కాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళా శాల అధ్యాపకులు కె. రమేష్ రెడ్డి,జి. సుభాష్, జి.అర్చన,తదితరులు పాల్గొన్నారు.

## రైళ్ల హాల్టింగ్‌పై డిఆర్ఎం సానుకూల స్పందన

ప్రజాపక్షం/రెబ్బెన ః ఆసిఫాబాద్ రోడ్ (రె బ్బెన) రైల్వే స్టేషన్‌లో పలు ముఖ్యమైన ఎక్స్ ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం) గోపాలకృష్ణన్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ప్రయాణికులు, సింగరేణి కార్మికులు ఎదు ర్కొంటున్న ఇబ్బందులను డిఆర్ఎమ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందిం చారు. సమస్యను పరిశీలించి రైళ్ల నిలుపుద లకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల స్పందనపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ గౌడ్, నవీన్ కుమార్ జైస్వాల్, అప్పు, వాస్రామ్ నాయక్, జహీర్ బాబా, బొమ్మినేని గిరి, మహేష్, వినోద్ జైస్వాల్ పాల్గొన్నారు.

## రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం చెల్లించాలి

బిజెపి జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ రూరల్ ః కొమరం భీమ్ జిల్లాలో వర్షాభావం కారణంగా పత్తి పంట నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.50 వేల పరిహారం అందించాలని బిజెపి జిల్లా అధ్య క్షుడు ధోని శ్రీశైలం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ వెంటనే పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజ నను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేసి రైతు లను ఆదుకోవాలన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వీడి రైతు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మన్ కీ బాత్ తెలం గాణ రాష్ట్ర కన్వీనర్ ఎలగతి సుచిత్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చెర్ల మురళీధర్, బిజెవైఎమ్ వాంకిడి మండల అధ్యక్షుడు మండోకర్ వికాస్ పాల్గొన్నారు.

## ఆపద్బాంధవుడైన శ్రీనివాస్.. అనాథ విద్యార్థినికి ఆసరా



ప్రజాపక్షం/కౌటాల ః తల్లిని కోల్పోయి అనాథగా మారిన ఒక పేద విద్యార్థినికి ఉచిత వసతి, చదువుకునే అవకాశం లభించింది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమా నెపల్లి మండలంలోని ధరంపల్లి గ్రామానికి చెందిన ఆదే అక్షిత అనే విద్యార్థిని ఇటీవల తల్లిని కోల్పోయి తీవ్ర దిక్కు తోచని స్థితిలో పడింది. ఈ విషయాన్ని తెలుసుకున్న శ్రీ శివరామసాయి యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గుర్లె శ్రీనివాస్ తక్షణమే స్పందించారు. అక్షిత విద్యాభ్యాసం నిలిచిపోకూడదనే ఉద్దేశంతో ఆయన మండల విద్యాధికా రితో మాట్లాడి, ప్రభుత్వ హాస్టల్‌లో సీటు కేటాయించేలా చొరవ చూపారు. వసతి గృహంలో చేర్పించడమే కాకుండా, ఆ చిన్నారికి కావలసిన నోట్‌బుక్‌లు, పెన్నులు, ఇతర విద్యా సామగ్రిని సొంత ఖర్చులతో అందించి విద్యా ర్థినికి కొండంత అండగా నిలిచారు. అక్షిత ఉన్నత చదు వులు పూర్తి చేసుకునే వరకు తమ సొసైటీ తరపున సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా గుర్లె శ్రీనివాస్ తెలిపారు. అనాథ విద్యార్థిని భవిష్యత్తుకు మార్గం సుగమం చేసిన శ్రీనివాస్ ఉదారతను, సొసైటీ సేవలను స్థానికులు, గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందిం చారు. ఈ కార్యక్రమంలో శ్రీ శివరామసాయి యూత్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మెడికల్ బోర్డులో అన్యాయంపై నల్ల బ్యాడ్జీలతో నిరసన



ప్రజాపక్షం/శ్రీరాంపూర్ ః సింగరేణి సంస్థ నిర్వహించిన మెడికల్ బోర్డులో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ హెచ్ ఎంఎస్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనులు, విభాగాల వద్ద మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. హెచ్ ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు ఎస్ఆర్‌పి 1, 3, ఆర్‌కె 7, ఆర్‌కే న్యూటెక్, ఏరియా వర్క్‌షాప్, సివిల్ డిపార్ట్ మెంట్ వద్ద కార్మికులు ఆందోళన నిర్వహిం చారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య మాట్లాడుతూ గత 30 నెలలుగా మెడి కల్ బోర్డు నిర్వహించకపోవడంతో దాదాపు 2,000 మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఇటీవల నిర్వహించిన బోర్డులో కేవలం 120 మందిని పిలిచి, అందులో 24 మందిని మాత్రమే అన్‌ఫిట్‌గా ప్రక టించడం అన్యాయమన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి కార్మికుడిని మెడికల్ అన్‌ఫిట్‌గా ప్రకటించి వారి వారసు లకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పాత విధానంలో నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డులు నిర్వ హించకపోతే కల్వకుంట్ల కవిత ఆమరణ నిరాహార దీక్ష చేపడతారని హెచ్చరించారు. గుర్తింపు సంఘాలైన ఏఐటి యుసి, ఐఎన్టియుసిలు కార్మికుల సమస్యలను పట్టించుకో వడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్ర మంలో ఏరియా ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, సెంట్రల్ ఉపా ధ్యక్షులు మీస కొమురయ్య, దుర్గం లక్ష్మణ్, రాచకొండ సురేష్, పులి రాజేందర్, ఎస్‌కే వలి, తిరుపతి, నాయ కులు, కార్మికులు పాల్గొన్నారు.

## వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్

అప్పాల గణేష్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ ః నిర్మల్ పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి మంగళవారం పలు అభి వృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో బిజీబిజీగా గడిపారు. గాజులపేట్‌లో దెబ్బతిన్న రోడ్ల పరిశీలనవర్షాకాలం నేప థ్యంలో గాజులపేట్ (వార్డ్ నెం. 21)లో ఆయన పర్యటిం చారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచిన ప్రాంతా లను, దెబ్బతిన్న రహదారులను పరిశీలించి, ప్రజల రాక పోకలకు ఇబ్బంది కలగకుండా త్వరలోనే రోడ్ల మరమ్మత్తు పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో స్థానిక కౌన్సిలర్ ఇర్ఫాన్, కోఆప్షన్ మెంబర్ అస్లాం, నాయకులు మతిన్, ఖీజర్, జమాల్, హబీబ్, ఇమ్రాన్ పాల్గొన్నారు. వైస్ చైర్మన్‌కు ఘన సన్మానంమహాలక్ష్మి ఆల య నూతన కమిటీ ప్రతినిధులు వైస్ చైర్మన్‌ను మర్యాదపూ ర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పెండం శ్రీనివాస్, ఆలయ క మిటీ చైర్మన్ కాళ్ల రాజు, వైస్ చైర్మన్ పోతుగంటి శ్రీను, పా తర్ల సూర్య, కాలనీవాసులు పాల్గొన్నారు. టిజిఎస్ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగుల వినతిఅలాగే టీజీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యో గుల సంఘం నాయకులు వైస్ చైర్మన్‌ను కలిసి తమ విశ్రాంతి భవనం విస్తరణ పనులకు సహకరించాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు.

## బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/కాగజ్ నగర్ ః కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో విద్యుత్ ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు మంగళవారం ఎక్స్ గ్రేషియా చెక్కులను అందజేశారు. విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఇర్ఫాన్ అహ్మద్ చేతుల మీదుగా రూ.16.60 లక్షల విలువై న చెక్కులను పంపిణీ చేశారు. దహెగాం, బెజ్జూర్, కాగజ్‌నగర్ మండ లాలకు చెందిన ముగ్గురి కుటుంబ సభ్యులకు ఈ పరిహారం అందిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్లు, తెగిపడిన తీగల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూ చించారు. ఈ కార్యక్రమంలో దహెగాం ఏఈలు రవీందర్, రాంప్ర సాద్, లైన్ ఇన్స్పెక్టర్లు సతీష్, శ్రీనివాస్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## 22న ధర్నాలను విజయవంతం చేయాలి

మిట్టపల్లి వెంకటస్వామి, దాగం మల్లేష్

ప్రజాపక్షం/కాసిపేట ః సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం జులై 22న నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకట స్వామి, బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ పిలుపునిచ్చారు. కాసిపేట మండలం సోమగూడెంలోని కామ్రేడ్ ఎం. కొమురయ్య భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాల కుల జోక్యం పెరగడం వల్ల 136 ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ అభివృద్ధికి ఆటంకం ఏర్పడిందని విమర్శించారు. గత బిఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాల వల్ల సంస్థ తీవ్ర సంక్షోభంలోకి నెట్టబ డిందని, మెడికల్ బోర్డు నిర్వహణలో పారదర్శకత లోపించి కార్మికు లకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. ప్రభుత్వాల తీరును నిర సిస్తూ బుధవారం సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు, విభాగాల్లో ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆందోళనను జయ ప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బ్రాంచ్ ఇన్‌చార్జి చిప్ప నరసయ్య, లక్ష్మీ నారాయణ, చిప్పరి శ్రీహరి, రంజిత్ కుమార్, బిల్లెం శ్రీనివాస్, అడిపు రవీందర్, శంకర్, కోల కమలాకర్, ఆంజనేయులు, అనిల్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్యాక్రాంతమైన లిడ్‌క్యాప్, లెదర్ పార్క్‌లను అభివృద్ధి చేయాలి

ప్రజాపక్షం/నేరడిగొండః రాష్ట్ర వ్యాప్తంగా అన్యాక్రాంతమైన లిడ్ క్యాప్, లెదర్ పార్క్‌ల భూములను రక్షించి, మాదిగ ఉపకులాల అభి వృద్ధికి ఉపయోగించాలని మాదిగ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు కత్తి గంగాధర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాదిగ, మాంగ్, మోచి, మాతాంగ్, బుడగ జంగం తదితర కులాల ప్రజలు చేతివృత్తులనే నమ్ముకుని దయనీయ జీవి తాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదే శ్‌లో లెదర్ పార్క్‌లను అభివృద్ధి చేసి చెప్పులు కుట్టే శిక్షణ కార్యక్ర మాలు నిర్వహించేవారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం మాదిగ కులవృత్తిదారులను పట్టించుకో కుండా, లెదర్ పార్క్ భూములను ఇతరులకు కట్టబెట్టి మోసం చేసిం దని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి చెప్పులు కుట్టే వృత్తిదారులకు సరైన శిక్షణ ఇచ్చి ఉపాధి భరోసా కల్పించాలని కోరారు. టాటా, బాటా, స్పార్క్ వంటి కార్పొరేట్ కంపెనీలకు పెద్ద పీట వేయకుండా, లిడ్‌క్యాప్ ద్వారా స్థానిక చేతివృత్తి దారులకు ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు. తోలు పరిశ్రమల అభివృ ద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి అంతరించిపోతున్న కులవృత్తు లను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా కాల్వ సర్పంచ్ రోజా నియామకం

ప్రజా పక్షం/దిలావర్‌పూర్ ః తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ SC సెల్ జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ ఉత్తర్వులతో నిర్మల్ జిల్లా SC సెల్ జనరల్ సెక్రటరీగా దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామ సర్పంచ్ రోజాను నియమించారు.ఈ మేరకు పార్టీ అధిష్ఠానం నియా మక పత్రాలు అందజేసింది. రోజా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తాను. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా పార్టీకి, ప్రజలకు వారధిగా పనిచేస్తాను అని తెలి పారు.ఎస్సీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం పార్టీ ఆదేశాల మేరకు గ్రామ,జిల్లా స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తానని ఆమె అన్నారు.నియామకంపై కాల్వ గ్రామ ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ

**ప్రజాపక్షం/బాల్కొండ :** మండలంలోని ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమం ఈనెల 20 న సోమవారం ఎంఈఓ బట్టు రాజేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్ఎన్‌పై ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన కల్పించడం, దీంతో విద్యార్థులు చదవటం, రాయడం, గణిత సామర్థ్యాలను మరింతగా పెంపొందించడంపై శిక్షణనిస్తారన్నారు. మూడు రోజుల శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు తరగతి గదుల్లో విద్యార్థుల అభ్యసన నైపుణ్యాలను మెరుగుపర్చటానికి సరికొత్త బోధనా పద్ధతులను నేర్చుకుంటారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

### డిపిఒ శ్రీనివాస్‌రావు



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దని మంగళవారం డిపిఒ శ్రీనివాస్‌రావు అన్నారు. మండల కేంద్రంలో గ్రామపంచాయతీ సిబ్బంది నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేయాలన్నారు. రోడ్లపై గుంతలు గుర్తించి మొరంతో పూడ్చాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని, దోమల నివారణ నిమిత్తం ఫాగింగ్ చేపట్టాలని, మురికి కాలువలు తీయించి, మురికికాలువల వెంబడి బ్లీచింగ్ పౌడర్ స్ప్రే చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిఓ సదాశివ్, సర్పంచ్ కొత్తపల్లి హారిక, ఉపసర్పంచ్ కొత్తపల్లి అశోక్, కార్యదర్శి వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

## రైల్వేబ్రిడ్జి కింద నీటి నిల్వ

### ఇబ్బంది పడుతున్న ప్రయాణీకులు



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి:** మండల కేంద్రం నుండి ఉప్లూర్‌కు వెళ్లే రోడ్డులో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీటి నిల్వతో ప్రయాణీకులకు ఇబ్బందికరంగా మారింది. మండల కేంద్రానికి నిత్యం వివిధ గ్రామాల నుండి అనేక మంది ప్రయాణీకులు వివిధ పనుల కోసం వచ్చి వెళుతుంటారు. ఈ బ్రిడ్జి నిర్మించిన నాటి నుండి నేటి వరకు మురికి నీటిలోనే బాటసారులు ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి. నిత్యం నీళ్ల తాకిడి ఉండటంతో ఈ అండర్ బ్రిడ్జి రోడ్డంతా గుంతలుగా ఏర్పడింది. రైల్వే అధికారులు ముందు చూపులేకుండా అండర్ పాసెస్ వే నిర్మాణంచేశారని, వర్షాలు పడిన ప్రతిసారి అక్కడ నీరు అడుగుల లోతు నిలిచిపోయి అటువైపు వెళ్లే ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుంది. సంబంధిత రైల్వే అధికారులు నీటిని వెంటనే తొలగించి శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రయాణీకులు, ప్రజలు కోరుతున్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డుకు మరమ్మతులు చేయాలి

### ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రహమాన్



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** భీమ్‌గల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డు మార్గానికి మరమ్మతులు చేయించాలని భీమ్‌గల్ మున్సిపల్ కమీషనర్‌కు ఎన్ఎస్‌యు ఐ జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ రహమాన్ వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలకు వెళ్లే రోడ్డు మార్గం గుంతలతో ఉండటంతో చిన్నపాటి వర్షానికి బురదమయమవటంతో విద్యార్థులు, అధ్యాపకులు రాకపోకలకు చాలా ఇబ్బందులు పడుతున్నారని, రానున్న భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని కళాశాలకు వెళ్లే రోడ్డు మార్గాన్ని తాత్కాలికంగా మరమ్మతులు చేయించి వీలైనంత త్వరగా బీటీ రోడ్డు వేయాలని మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం సమర్పించామని సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమీషనర్ త్వరితగతిన పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తామని తెలిపారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు సుబ్బు, అశ్విత్, విష్ణు, మనోజ్, సుశాంత్, అఫన్, అక్షత్, మహేష్, శ్రీనిథ్, అభిలాష్ అశోక్, హర్షిత్ పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీఛార్జి, భాష్పవాయువు ప్రయోగం దారుణం

### మాజీ ఎంపీపీ పస్కు నర్సయ్య



**ప్రజాపక్షం/ఆర్మూర్ :** ఢిల్లీలో నిన్న కుండపోత వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం విచక్షణారహితంగా లాఠీఛార్జి చేయడం, భాష్పవాయువు ప్రయోగించడం, విద్యార్థులను చితకబాదటం తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీ ఎంపీపీ, ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పస్కు నర్సయ్య అన్నారు విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం సమస్యను పరిష్కరించకుండా మరింత పెంచుతూ శాంతియుతంగా జరుగుతున్న ఉద్యమంపై విషప్రచారం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. విద్యార్థులపై పోలీసు బలప్రయోగం చేయడంతో వారి గొంతును అణచివేయలేరన్నారు. నీట్ పేపర్ లీక్‌కు విద్యార్థులపైజరిగిన దాడులకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తమ హక్కుల కోసం ప్రశ్నించే హక్కును కేంద్ర ప్రభుత్వం గౌరవించాలని, అణచివేత వి ధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై దాడులు ఆపాలి ప్రజా ఉద్యమాలను గౌరవించాలి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పస్కు నర్సయ్య పిలుపునిచ్చా రు.

## కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం




**ప్రజాపక్షం/డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి:** ఢిల్లీలో నీట్ పరీక్ష అక్రమాలపై న్యాయ పోరాటం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్‌యు) ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి ఎల్.అనిల్ కుమార్, విశ్వవిద్యాలయ నాయకుడు నితిన్ మాట్లాడారు. నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఘటనపై నిష్పాక్షపాతంగా విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు నసీర్, సృజన్, హేమాంజలి, అరవింద్, రాజు పాల్గొన్నారు.

## యువతపై లాఠీఛార్జి చేయటం దుర్మార్గ చర్య

### సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** యువతపై లాఠీఛార్జి చేయడం దుర్మార్గమైన చర్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించాల్సిన నీట్ ఇతర ప్రవేశ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టాలని, దీనికి కారణమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని గత కొన్ని రోజులుగా దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్ చుక్ ఆరోగ్యం క్షీణిస్తున్న పిఎం మాకేమీ పట్టనట్లుగా వ్యవహరించటం సరికాదన్నారు. ఇప్పటికైనా నీట్ ప్రశ్నపత్రాల లీకేజీకి బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్ర ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయాలని, విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడొద్దని, నిన్న ఢిల్లీలో జరిగిన యువజనుల ర్యాలీలో భాష్పవాయువులను ప్రయోగించి లాఠీఛార్జి చేయడం హేయమైన చర్య అన్నారు.

## విద్యార్థులకు ఆరోగ్య పరీక్షల నిర్వహణ



**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని పాలెం గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మహేష్ కుమార్ ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులకు కమ్మర్‌పల్లి, ఆరోగ్య కేంద్రం సూపర్ వైజర్ మారుతి ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగిందని పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మహేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత సీజనల్ వ్యాధులు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు చేతులు కడుక్కోవడం గురించి వివరించారు. వండిన ఆహార పదార్థాలు సరిగా నిల్వ చేసుకోవాలని ఇంటి ప్రక్కన నీరు నిలువ కాకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ మారుతి, ఎఎన్ఎం సుజాత, ఆశా వర్కర్ లు ప్రవళిక, సుమలత, పాఠశాల ఉపాధ్యాయ బృందం మహేష్ కుమార్, నరసింహ స్వామి, రాజేందర్, జయశ్రీ, త్రివేణి, మమత, రాజేశ్వరి, నచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన కనర్ గాం ఉప సర్పంచ్

**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి నుంచి కాగజ్‌నగర్ వెళ్లే ప్రధాన బ్రిడ్జితో పాటు గుండి బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని కనర్ గాం ఉప సర్పంచ్ దుర్గం జీవన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని సిఎం నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవన్ మాట్లాడుతూ, బ్రిడ్జిల నిర్మాణం ఆలస్యం కావడం వల్ల విద్యార్థులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాకాలంలో వాగులు పొంగిపొర్లి రాకపోకలు నిలిచిపోతున్నాయని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వినతిపై సిఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి, బ్రిడ్జిల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

## అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026–27సంవత్సరంలో అతిథి అధ్యాపకులుగా పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.టి.పెద్దన్న ఒక ప్రకటనలో తెలిపారు. కెమిస్ట్రీ 1, తెలుగు 1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ 2 సబ్జెక్టులలో బోధించుటకు ఆసక్తి గల అధ్యాపకులు తమ విద్యార్హత అనుభవంతో ధృవీకరణ పత్రాలను కళాశాల కార్యాలయంలో ఈ నెల 22వ తేదిన అందించాలని తెలిపారు. అలాగే ఈ నెల 23వ తేదిన నిజామాబాద్ జిల్లాలోని గిరిరాజ్ కళాశాలలో ఉదయం పది గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ప్రిన్సిపల్ డాక్టర్ టి.పెద్దన్న తెలిపారు.

## 22న చలో ముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహన

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సిబిసి), నిజామాబాద్ క్షేత్ర కార్యాలయం, తెలంగాణ పోలీస్ ఈగల్ ఫోర్స్ సహకారంతో ఈనెల 22న ఉదయం 10.15 గంటలకు గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో నషా ముక్త భారత్ అభియాన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రీజినల్ నార్కోటిక్స్ కంట్రోల్ సెంటర్, ఈగల్ ఫోర్స్ డీఎస్పీ ఎం.సోమనాథం ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మత్తు పదార్థాల దుర్వినియోగం, ముఖ్యంగా యువతలో పెరుగుతున్న నేపథ్యంలో వాటితో కలిగే శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించటం ప్రధాన ఉద్దేశ్యం. మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టడంలో యువత, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, పౌర సమాజం చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరాన్ని కార్యక్రమంలో వివరించనున్నారు.

## విద్యార్థులకు భోజన ప్లేట్ల పంపిణీ



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 402స్టైయిన్‌లెస్ స్టీల్ భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. లాడ్జ్ కీస్ నం.297 ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు కావడానికి ఉపయోగపడే విధంగా నాణ్యమైన స్టెయిన్‌లెస్ స్టీల్ ప్లేట్లను అందచేశారు. ఈ కార్యక్రమానికి దాతగా వి.సూర్య ప్రకాష్ సహకారం అందించారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని స్థానిక సర్పంచ్ కందగట్ల రాంచందర్, పాఠశాల ఉపాధ్యాయులు, నిర్వాహకులు పేర్కొన్నారు. దాతలకు కార్యక్రమాన్ని నిర్వహించిన లాడ్జ్ కీస్ నం.297 ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్లేట్ల పంపిణీతో విద్యార్థులు మరింత పరిశుభ్రమైన వాతావరణంలో మధ్యాహ్న భోజనం చేసే అవకాశం కలిగిందని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి లయన్స్ క్లబ్ సభ్యులు గంగారెడ్డి, సూర్యానారాయణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీటిని పట్టుకోండి, భవిష్యత్తును కాపాడండి!



**ప్రజాపక్షం /కోరుట్ల :** వర్షపు నీటిని ఒడిసిపట్టి, వృథా కాకుండా సంరక్షించడం చాలా ముఖ్యం. దీని వల్ల భూగర్భ జలాలు పెరిగి, వేసవిలో నీటి ఎద్దడిని నివారించవచ్చు. ఇళ్లల్లో, భవనాలపై పడే వర్షపు నీటిని పైపుల ద్వారా ఇంకుడు గుంతలకు లేదా భూగర్భ ట్యాంకులకు మళ్లించాలి. దీని ద్వారా నీరు వృథా కాకుండా భూమిలోకి నీళ్లు ఇంకుతుయాని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర అన్నారు. " వర్షపు నీటిని పట్టుకోండి, భవిష్యత్తును కాపాడండి! " అనే నినాదంతో స్థానిక ప్రభుత్వ జెడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో విద్యార్థులకు వర్షపు నీటి సంరక్షణ (రైన్ వాటర్ హార్వెస్టింగ్) ఇంకుడు గుంతల ప్రాముఖ్యతపై డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు.ఈ పోటీలలో విద్యార్థులు తమ అద్భుతమైన ఆలోచనలను, సృజనాత్మకతను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కోరుట్ల మున్సిపల్ కమిషనర్ వి. రాఘవేంద్ర, మండల విద్యాశాఖ అధికారి నరేషం విద్యార్థులను అభినందిస్తూ, భూగర్భ జలాలు పెరగడానికి ఇంకుడు గుంతలు ఎంతో అవసరం. నీటిని వృథా చేయకుండా ప్రతి బొట్టును సంరక్షించుకోవాలి. లేదంటే భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోవాల్సి వస్తుంది అని పేర్కొన్నారు.అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, మున్సిపాలిటీ డి.ఈ.ఈ అరుణ్ కుమార్, డిప్యూటీ డీ.ఈ.ఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# మంత్రి అడ్లూరి పూజలకు కరుణించిన వాన దేవుడు



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు తొలగిపోవాలని,ప్రజలు,రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం (2026 జూలై 19న ) వరుణ యాగం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఈ నేపథ్యంలో మరుసటి రోజు ధర్మపురి నియోజకవర్గంలో కుండ పోత వర్షం కురిసిందని డిసీసీ జిల్లా కార్యదర్శి తడగొండ విజయ్ కుమార్ అన్నారు.ఈ సందర్భంగా మంగళవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం కేంద్రంలో విజయ్ కుమార్ మాట్లాడుతూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నంది రిజర్వాయర్ ను పరిచిలించి అక్కడ కబడ్డీ ఆడుతూ యాగాలు హోమాలు చేస్తే నీళ్లు వస్తాయా అని ఏద్దేవా చేశారు . మీరు అన్నది నిజమే మీ కెసిఆర్ మనసులో కుళ్ళు కుతంత్రాలు పెట్టుకొని యాగాలు హోమాలు చేస్తే నీళ్లు వర్షాలు రెండు రావు. కానీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేస్తే నీళ్లు వస్తాయి. మంత్రి లక్ష్మణ్ కుమార్ సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ,పాడి పంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలనే లక్ష్యంతో యాగాలు హోమాలు చేసిన మరుసటి రోజే ధర్మపురి నియోజకవర్గం లో కుండపోత వర్షం కురిసిందని అన్నారు. మనసులో ఎటువంటి కల్మషం లేని, ఎదుటివారికి ఎటువంటి హాని చేయని, నిరంతరం సంక్షేమ కోసం పాటుపడే మంత్రి పూజలు చేస్తే సాక్షాత్తు ఆ వరుణుడే కరుణించి ధర్మపురి నియోజకవర్గం లో కుండపోత వర్షం కురిపించాడు. ఎల్ నినో ప్రభావం తో వర్షాలు పడక రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రజల కష్టాన్ని చూడలేక మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎల్ నినో ప్రభవాన్ని ఎదురుకొనే ప్రత్యన్మయ్య పంటల మీద రైతులు అవగాహనా సదస్సులు నిర్వహిస్తూ నిరంతరం ప్రజలకోసం కష్టపడితే మీరేమో ప్రజలను పక్కకు వదిలేసి మీ కార్యకర్తలతో కబడ్డీ ఆడుతూ రైతులను ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారు . ఇదేనా మీరు ప్రలకోసం పాటుపడే తీరు కరువు కాలం లో ప్రజలకు ఉపయోగపడలే తప్ప ప్రతిదాన్ని రాజకీయ లబ్ది కోసం వాడుకుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.

## టి పి ఎస్ స్కూల్ స్థల పరిశీలన

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండలంలోని సాతారం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించే తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్థలాన్ని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మంగళవారం పరిశీలించారు. స్థానిక జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల ఆవరణలో ఉన్న స్థలాన్ని పరిశీలించి అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఆర్డీవో నరసింహారావు, గ్రామ సర్పంచ్ చెట్లపల్లి కిషన్ గౌడ్ తహసిల్దార్ రామచందర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ అశోక్, ఎంఈఓ దామోదర్ రెడ్డి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు ఉన్నారు.

## సీత్లా భవానీ వేడుకల్లో

## మాజీ జెడ్‌పి చైర్‌పర్సన్ సురేష్

**ప్రజాపక్షం / సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం ధర్మనాయక్ తండాలో సీత్లా భవానీ పండుగ కార్యక్రమంలో మాజీ జెడ్పి చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తేలు రాజు, సర్పంచ్ భూక్య సంతోష్, ఆకుల రమేష్, నాయకులు భూక్య సుధాకర్, సుమన్ నాయక్, భాస్కర్ నాయక్, శేఖర్, తిరుపతి, గంగాధర్, రాజేష్, విక్రం, గంగారెడ్డి, సుధాకర్, తిరుపతి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేద కుటుంబానికి అండగా హబ్సీపూర్ గ్రామస్థులు



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన దావనపల్లి గవాస్కర్ అనారోగ్య కారణాల వల్ల గత కొద్ది రోజుల క్రితం ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. గవాస్కర్ భార్య ఇద్దరు పిల్లలు గౌతమ్ గణశ్రీ ఉన్నారు. వారు నీరుపేద కుటుంబం కాగా వారి ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకున్న హబ్సీపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్ దేశాల్లో ఉన్నవారు గ్రామంలోని కొందరు డెబ్బై ఐదు వేల రూపాయలు,సింగపూర్ లో ఉన్నవారు యాభై ఎనిమిది వేల ఐదు వందల రూపాయలు మృతుడి పదవ తరగతి మిత్రులు ముప్పై రెండు వేల ఐదు వందల రూపాయలు ఆర్థిక సహాయం అందించగా మొత్తం నగదు ఒక లక్ష అరవై ఆరు వేల రూపాయలు మృతుడి కుమార్తె పేరు మీద సుకన్య సమృద్ధి యోజనలో డిపాజిట్ చేయడం జరిగిందని తద్వారా ఆ పాప భవిష్యత్తుకు భరోసా కల్పించమని హబ్సీపూర్ గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇండ్ల జమున రాజేందర్, మాజీ ఎంపీటీసీ ముస్కు దామోదర్ రెడ్డి,బొడ్డు గంగాధర్,దుంపటి శేఖర్,ఉమేందర్, నాగుల శ్రీనివాస్,బుర్ర శ్రీకాంత్,అనిల్ కుమార్ ,సంతోష్, మహేష్,అంజయ్య,మహేష్,పాల్గొన్నారు.

# ట్రాక్టర్ డీ కొన్న డిసిఎం : వ్యక్తి మృతి

**ప్రజా పక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామ శివారు జగిత్యాల కరీంనగర్ జాతీయ రహదారి పై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా,మరొకరు గాయపడ్డారు.ఎస్సై సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ (ఎంహెచ్ 26 సిహెచ్ 3656) బల్వంతపూర్ గ్రామం నుంచి మామిడి కట్టెల లోడుతో జగిత్యాల వైపు వెళ్తున్న ట్రాక్టర్ (ఎ పి15 వై 3755), ట్రాలీ (ఎ పి 15 యు 1801)ను వెనుక నుంచి ఢీకొట్టింది.ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ పక్కన కూర్చున్న బల్వంతపూర్ గ్రామానికి చెందిన మానేపల్లి పోచయ్య (45) ట్రాక్టర్‌పై నుంచి కిందపడగా, అతని మీదుగా డీసీఎం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.ప్రమాదంలో డీసీఎంలో ప్రయాణిస్తున్న వెల్గటూర్ గ్రామానికి చెందిన రాజ్ మహమ్మద్ గాయపడగా, 108 అంబులెన్స్‌లో జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్ కృష్ణ శంకర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



## ఆషాఢ మాస గోరింటాకు వేడుకలు

### -మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ అన్నం లావణ్య

**ప్రజాపక్షం /కోరుట్ల :** కోరుట్ల పట్టణంలో ఆషాఢ మాసం పురస్కరించుకొని మహిళలు గోరింటాకు వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా గోరింటాకు తెచ్చుకుని, నూరుకొని చేతులకు పెట్టుకున్నారు. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల కలిగే ఆరోగ్య, ఆధ్యాత్మిక విశిష్టతలను ఈ సందర్భంగా మహిళలు గుర్తుచేసుకున్నారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అన్నం లావణ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమెతో పాటు సంఘం గ్రామ సర్పంచ్ స్వరూప, మాజీ మార్కెట్ చైర్మన్ లక్ష్మి , మాజీ కౌన్సిలర్ రాధిక, ప్రముఖ మహిళా ప్రతినిధులు విజయ, నవ్య, కీర్తన, రజిత, జల, విజయ, సంగీత, శ్యామల, బుచ్చమ్మ, భూమిక, లలిత తదితరులు పాల్గొన్నారు.మహిళలందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని గోరింటాకు విశిష్టతను చాటిచెప్పారు.

## ఆర్టీసీ బస్సు చోరీ

### పోలీసుల అదుపులో నిందితుడు

**ప్రజాపక్షం/కోరుట్ల :** కోరుట్ల పట్టణంలో ఆర్టీసీ బస్సు చోరీ కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే కోరుట్ల బస్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 9వ నంబర్ ప్లాట్ ఫామ్ పై నిలిచి ఉంది. గుర్తుతెలియని వ్యక్తి బస్సును కోరుట్ల ఆర్టీసీ బస్టాండ్ నుండి నిజాంబాద్ వైపు వెళుతుండగా గమనించిన ఆర్టీసీ సిబ్బంది, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కోరుట్ల పోలీస్ మెట్పల్లి పోలీస్ కు సమాచారం అందించగా వెంటనే స్పందించిన మెట్పల్లి పోలీస్ బస్సును వెంబడించి మెట్పల్లి శివారులో గండి హనుమాన్ వద్ద ఆర్టీసీ బస్సును స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఈ ఘటనపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## గొల్లపల్లి గ్రామపంచాయతీకి శవపేటిక విరాళం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో దివంగత కుంబార్ కార్ రాజన్న లక్ష్మీ భాయి జ్ఞాపకార్థం వారి మనవడు కుంబార్ కార్ అరుణ్, మనవరాలు మేఘన సామాజిక సేవాభావంతో గొల్లపల్లి గ్రామపంచాయతీకి శవపేటికను విరాళంగా అందజేశారు. గ్రామ ప్రజలకు అవసరమైన సమయంలో ఈ శవపేటిక ఉచితంగా అందుబాటులో ఉండేలా గ్రామపంచాయతీకి అప్పగించారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు,ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. సమాజానికి ఉపయోగపడే విధంగా చేసిన ఈ సేవాభావం ఆదర్శప్రాయమని కొనియాడారు. దివంగత పెద్దల జ్ఞాపకార్థం ప్రజోపయోగ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా కుంబార్ కార్ కుటుంబ సభ్యుల సేవా దృక్పథాన్ని ప్రశంసిస్తూ వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ శవపేటిక గ్రామ ప్రజలకు అత్యవసర సమయాల్లో ఎంతో ఉపయోగపడుతుందని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

## తెలంగాణ ఏర్పాటు సమయంలో గిరిజన సోదరులది ప్రధాన పాత్ర

**ప్రజాపక్షం / సారంగాపూర్ :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమ సమయంలో గిరిజన సోదరులు ప్రధాన పాత్ర పోషించారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం పలువురు నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం దళితులకు గిరిజనులకు వారి జనభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పింపజేయాలని ఉండగా ఉమ్మడి రాష్ట్రంలో 10శాతం గిరిజనులు ఉండగా ఆరు శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలు చేయబడ్డదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసిఆర్ ఆరు శాతం ఉన్న రిజర్వేషన్లు 10శాతం చేశారని గుర్తు చేశారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడం వల్ల మౌళిక సదుపాయాలు కల్పించబడ్డాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తేలు రాజు, సర్పంచ్ ఆకుల రమేష్, రాంచంద్రారెడ్డి, సర్పంచ్ భూక్య సంతోష్, ఉప సర్పంచ్ చిరంజీవి, తిరుపతి, గంగాదర్, సుధాకర్, భాస్కర్ నాయక్, మహిపాల్ రెడ్డి, శేఖర్, రాజు, మహేష్, శ్రీధర్, నోముల తిరుపతి, వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

